క్లుప్తంగా

ఏఎస్ఓగా ధనలక్ష్మి



పూడి ధనలక్ష్మి

రామభద్రపురం: ఇటీవల విడుదలైన స్పెషల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఫలితాలలో రామభద్రపురం సచివాలయం-2లో వెల్ఫేర్ అసిస్టెంట్ పూడి ధనలక్ష్మి ఏఎస్ఓగా సెలక్ట్ అయింది. గజపతినగరం మండల ఏఎస్ఓగా బాధ్యతలు చేపట్టింది. ఏఎస్ఓ ఉద్యోగం సాధించిన లక్ష్మిని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, ఎంపీడీఓ రమామణి, తోటి సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

శ్లాబ్ నిర్మాణ పనుల పరిశీలన



శ్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ లెంక రాంబాబు

రేగిడి: మండలంలో పెద్దశిర్లాం గ్రామంలో నాడు-నేడు కార్యక్రమం కింద రూ.40 లక్షలతో ప్రభుత్వ పాఠశాల కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం శ్లాబ్ పనులు జరిగాయి. సర్పంచ్ లెంక రాంబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాలయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానిని నిధులు మంజూరుచేయడం ఆనందంగా ఉందన్నారు.

విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీధర్

బొబ్బిలి: క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలని డీఎస్పీ పుల్లూరు శ్రీధర్ అన్నారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో జరిగిన తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను బుధవారం ఆయన అభినందించారు. ఈ పోటీల్లో నవతేజనాయుడు గోల్డ్ మెడల్, సూర్యశశాంక్, గీతిక, శ్రీవల్లి, గ్రీష్మ, సృజన, శృతి సిల్వర్ మెడల్ సాధించారు. లోకేష్, హేమంత్, వంశీ, చరణ్, శ్రీకర్‌లు బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులతో పాటు కోచ్ ఎం.సుధాకర్‌ను డీఎస్పీ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుంది



మత్స్యకారులకు శిక్షణ ఇస్తున్న ఫిషరీస్ అధికారులు

రేగిడి: మత్స్యకారులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా ఫిషరీస్ ఏఐఎఫ్ఓ జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీవీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో బుధవారం ఎస్ఎఫ్‌డీబీ ఆధ్వర్యంలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ మత్స్యకారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చేపల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని వివరించారు. కార్యక్రమంలో వీఎఫ్ఏ శారద, శ్రీనివాసరావు, కిరణ్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న డీపీఓ మోహనరావు

బాడంగి: వర్షకాలంలో అంటురోగాలు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.మోహనరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ..డ్రైనేజీల్లో పూడికలు తొలగించాలని, రోడ్లు శుభ్రం చేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులను ఆదేశించినట్లు చెప్పారు. పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, సున్నం, ఫినాయిల్‌ను సిద్ధం చేశామన్నారు. గ్రీన్‌అంబాసిడర్లు ప్రతిరోజు ఇంటింటికీ వెళ్లి తడి, పొడిచెత్తను సేకరించి డంపింగ్ కేంద్రాలకు తరలించాలని, చెత్తను కంపోస్టుగా మార్చి రైతులకు విక్రయించాలని సూచించారు. మండలంలో రూ.23.74 లక్షల ఇంటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.22.93 లక్షలు వసూలైనట్లు చెప్పారు.

ఘనంగా మారు రథయాత్ర



రథాన్ని లాగుతున్న సాయిభక్తులు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్ సత్యసాయిబాబా శివం మందిరంలో ఘనంగా తిరుగు రథయాత్ర బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ వేషధారణలతో అలరించారు. కృష్ణావతారంలో స్వామివారు రథంపై ఆశీసులు కాగా.. రథాన్ని లాగేందుకు చిన్నారులు, పెద్దలు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మందిరం ఆవరణం సాయి నామస్మరణతో మార్మోగింది. అంతకుముందు బాలవికాస్ చిన్నారులు చేపట్టిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

రాష్ట్రంలో పారదర్శక పాలన

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అవినీతి రహిత పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేస్తూ అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ప్రభుత్వ పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి జరిగిన లబ్ధిని వివరించారు. ఇంటి స్థలాలు ఇప్పించాలని పలువురు కోరగా.. అర్హులైన ప్రతీ ఒక్కరికి స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ పాలన సాగిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గంలో 15 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులు తాము చేస్తున్నామన్నారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. 2024 ఎన్నికలే టార్గెట్‌గా ప్రతీ ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, నాయకులు కటికి చిన్నారావు, డర్రు పైడిరాజు, కనిమెరక అప్పారావు, కటికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వగతం పలుకుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

అమ్మఒడి పథకం నిధుల విడుదలకు పార్వతీపురం మన్యం జిల్లాకు విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కాపుకార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చిన్నమేరంగి పాలి టెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద సీఎంకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

– సాక్షి నెట్‌వర్క్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన కాపుకార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్

3న డిప్యూటీ సీఎం రాక

మెంటాడ: డిప్యూటీ సీఎం, గిరిజన శాఖామంత్రి పీడి క రాజన్నదొర జూలై 3న మండల కేంద్రానికి రానున్నారని ఎంపీడీఓ త్రివిక్రమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణపై ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు, అన్నిశాఖల అధికారులతో సమీక్షిస్తారన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం: మండలంలో నందబలగ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేశారు. రెండుపూటలా పనులు చేయాలని, ఇచ్చిన కొలతలు పూర్తిచేసినట్లయితే గరిష్ట వేతనం లభిస్తుందన్నారు. వేతనదారులు కోరిన వరకు పనులు కల్పిస్తామన్నారు. ఏపీఓ సాయిరాం ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు పాఠశాల విద్యార్థులకు బుధవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం నూకరాజు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమన్నారు. పిల్లల చదువును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, జె.సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం ఆందోళన చెందొద్దు

రేగిడి: మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు విడుదలపై రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఉనుకూరులో మీడియాతో మాట్లాడుతూ మడ్డువలస ప్రాజెక్ట్ షట్టర్ల మరమ్మతులు పూర్తిచేశారని తెలిపారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రాజెక్టుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే ప్రాజెక్ట్‌లోకి నీరు చేరుతుందని, కాలువల ద్వారా నీటిని విడిచిపెడతారని వివరించారు. ఇనాం భూములు ఉన్న రైతులకు కూడా విత్తనాలు వస్తాయన్నారు. అలాగే ఆర్‌బీకేల్లో విత్తనాలు పంపిణీ ప్రస్తుతం జరుగుతోందని, యూరియా, డీఏపీ ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని వివరించారు.

ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు బాగా చదువుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని సౌకర్యాలు కల్పించారని బి.ఎరకయ్య అన్నారు. మండలంలోని లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, సాక్సులు ఇప్పటికే అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురపాక వెంకటరమణ, స్కూల్ కమిటీ చైర్మన్ కె.రమాదేవి, కె.చంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వే సిబ్బందికి సహకరించాలి

రేగిడి: గ్రామాల్లో భూములు సర్వే చేస్తున్న అధికారులకు రైతులు సహకరించాలని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి కోరారు. మండలంలోని పనసలవలస గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూముల సమగ్ర రీసర్వే చేస్తోందన్నారు. సర్వే జరిగే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న సమాచారాన్ని తీసుకుని రావాలని కోరారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

రాజాం సిటీ: రైతుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 30న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని రైతుసంఘం నాయకులు కొవ్వాడ అప్పలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని దోసరి గ్రామంలో బుధవారం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేసి యథావిధిగా ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, జీవో 254ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆదినారాయణ, సింహాచలం, ధనుంజయ్, స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

అదానీకి కట్టబెట్టే ప్రయత్నాలు మానుకోవాలి

బొబ్బిలి: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీని అదానీకి కట్టబెట్టే ప్రయత్నాలను మానుకోవాలని, కేంద్రం చర్యలతో ప్రజలపై భారం పడుతుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు అన్నారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 30న ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు వి.కృష్ణ, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు టి.అప్పలనాయుడు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

పాపినాయుడు మృతికి సంతాపం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త తెంటు పాపినాయుడు(65) బుధవారం మృతిచెందారు. బొబ్బిలిలో నివాసముంటున్న పాపినాయుడుకు గుండెపోటు రావడంతో ఇంటివద్దనే మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామం ముగడ తీసుకొనిరాగా మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు గ్రామానికి చేరుకుని పాపినాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. పాపినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు యామల శివప్రసాద్, మరిపి శంకరరావు, మత్స రాము తదితరులున్నారు.

విత్తనశుద్ధితో చీడపీడల నివారణ



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులు విత్తనశుద్ధి చేసుకోవాలని, దీని వల్ల పంటలను ఆశించే తెగుళ్లను చాలావరకు నివారించవచ్చని వ్యవసాయాధికారి కె.శిరిష అన్నారు. మండలంలోని వాడాడ పంచాయతీ చినవాడాడ గ్రామంలో ఖరీఫ్ వరిసాగుపై బుధవారం అవగాహన కల్పించారు. వరివిత్తనాలను ఏవిధంగా శుద్ధి చేసుకోవాలో వీఏఏ సాయికుమార్ రైతులకు వివరించారు. కౌలురైతులు వీఆర్‌ఓల నుంచి కౌలుకార్డులు తీసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్ లబ్ధిపొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. పొలంగట్లపై కందిపంట సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం వస్తుందన్నారు.

కాలేజీల మంజూరుకు వసతుల పరిశీలన

రామభద్రపురం: మండలంలో కోఎడ్యుకేషన్ కాలేజీల మంజూరుకు ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య బుధవారం రామభద్రపురం, ఆరికతోట ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. రామభద్రపురం ఉన్నత పాఠశాలను ప్రాధాన్యత-1, ఆరికతోట ఉన్నత పాఠశాలను ప్రాధాన్యత-2గా పరిశీలించి కళాశాలల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆయా పాఠశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు, కళాశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయా లేదా? తరగతి గదులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మరుగుదొడ్లు, ఆటస్థలం ఉందా లేదా అని పరిశీలించి ఆయా పాఠశాలల హెచ్ఎంలు కామేశ్వరరావు, ప్రసాద్‌రావులతో చర్చించారు. ప్రభుత్వం ప్రతీ మండలంలో రెండు పాఠశాలలను కళాశాలలుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఈ ఏడాది రూ.157 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యం
- స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు

రామభద్రపురం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అందుకు ఈ ఏడాది స్త్రీనిధి కింద రూ.157 కోట్లు రుణాలు మంజూరుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు స్త్రీ నిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మనాయుడితో కలిసి బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండలాల వీఓలతో బుధవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది స్త్రీనిధి కింద జిల్లాలో రూ.199.43 కోట్ల రుణాలు మంజూరు చేయగా వంద శాతం రికవరీతో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మహిళా సంఘ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నుంచి రూ.లక్ష వరకు 92 పైసలు చొప్పున వడ్డీతో రుణాలు ఇస్తామన్నారు. రుణాలతో వ్యాపారాలు చేసకుని జీవనోపాధి మెరుగు పరుచుకోవాలన్నారు.

రుణ మంజూరుకు 395 మందిని గుర్తింపు

వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి రుణాల మాదిరిగా ఈ ఏడాది నుంచి సీడ్ కేపిటల్ స్కీమ్ కింద చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చేందుకు ఏడు మండలాల పరిధిలో 395 మందిని గుర్తించామని ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మనాయుడు తెలిపారు. ఒక్కో మండలానికి 60 మంది చొప్పున 420 మంది లక్ష్యంకాగా 395 మంది అర్హులను గుర్తించామన్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున 50 పైసలు వడ్డీతో రుణం మంజూరు చేస్తామన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం స్కీమ్‌ల కింద 35 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. లబ్ధిదారు ఎంచుకున్న యూనిట్, అర్హతను బట్టి రూ.30 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఐస్‌క్రీమ్‌పార్లర్, టెంట్ హౌస్, డీజే సిస్టం, పిండిమిల్లులు, బెల్లం తయారీ యంత్రం, బేకరీలు, ఎంబ్రాయిడరీ మిషన్ వంటి యూనిట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏరియా మేనేజర్ రమేష్, రామభద్రపురం, బాడంగి ఏపీఎంలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



సారథిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణ పరిధిలోని సారథి, ఇందిరమ్మకాలనీల్లో బుధవారం ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలపై మాట్లాడారు. నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగితెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడి ఎవరికీ ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయని సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కమిటీలు, కాలయాపనలు లేకుండా అర్హులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రతీ సచివాలయం ద్వారా ప్రజల వద్దకే పరిపాలన వచ్చిందని వివరించారు. మేనిఫెస్టోను శతశాతం అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ సెల్ అధ్యక్షుడు కంబాల సందీప్, పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, దూబ గోపాలం, కిలారి శ్రీనివాసరావు, కొల్లి మోహన్, మజ్జి సూరపునాయుడు, సూర్యనారాయణ, అడపా తవిటినాయుడు, టి.లక్ష్మనాయుడు, శాసపు వేణుగోపాలనాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, పాలవలస శ్యామ్, యందవ చినబాబు, ముగడ రవి, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చురుగ్గా అప్పలంపేట బీటీరోడ్డు పనులు



అప్పలంపేట-వంతరాం బీటీ రోడ్డు పనులు

తెర్లాం: మండలంలోని అప్పలంపేట నుంచి వంతరాం వరకు రూ.కోటి 7లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అప్పలంపేట నుంచి వంతరాం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పలంపేట గ్రామ సర్పంచ్ గురవాన పార్వతి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఉపాధిహామీ పథకం నుంచి రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 7లక్షల నిధులు మంజూరు చేసింది. కొన్ని నెలల క్రితం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు రోడ్డు పనులకు భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు పనులు సకాలంలో పూర్తయితే అప్పలంపేట-వంతరాం మధ్య రాకపోకలు సుగమం అవుతాయి.

అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో ఏర్పడిన గోతులను పూడ్చడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై గాయత్రికాలనీకి చెందిన భీంపల్లి తిరుపతిరావు బుధవారం సీఐ కె.రవికుమార్‌కు ఫిర్యాదు చేశాడు. గత రెండేళ్లుగా తిమ్మయ్యపేట పెట్రోల్‌బంక్ సమీపంలో ఏర్పడిన గోతులు కారణంగా ఎంతో మంది ప్రమాదాల బారిన పడ్డారని తెలిపారు. గోతులను పూడ్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్, ఆర్అండ్‌బీ ఏఈలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఉద్యానపంటల సాగు ప్రణాళికలు సిద్ధం చేయాలి

తెర్లాం: వర్షాకాలంలో ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల పెంపకానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సాంకేతిక, క్షేత్ర సహాయకులకు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి ఏపీఓ కె.సుశీల అధ్యక్షతన బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లో భాగంగా ఏడు అంశాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వర్షాలు కురుస్తుండడంతో ఉద్యానవన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల వివరాలు, వాటికి చెల్లించిన బిల్లుల వివరాలు తెలియజేయాలని సూచించారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ వేతనదారులకు శతశాతం పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను నిర్మించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే.. ‘జగనన్న సురక్ష’ లక్ష్యం



వంగర: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే ‘జగనన్న సురక్ష’ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. మండలంలో గురవాం, అంతకాపల్లి తదితర గ్రామాల్లో బుధవారం వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, అధికారులతో సమీక్షించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సురక్ష కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈమేరకు గ్రామాల్లో సర్వేచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కామోదులు శ్రీరంగంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష గ్రామసభల వివరాలు

బాడంగి: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై ఒకటో తేదీ నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం తెలిపారు. అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి కార్యక్రమం అమలును పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. జూలై 1న ఉదయం 11 గంటలకు రేజేరు, కోడూరు-1 సచివాలయంలో, 4న బొత్సవానివలస, కోడూరు-2 సచివాలయాలు, 6న ఆనవరం, వీరసాగరం సచివాలయాలు, 11న పాల్తేరు, తెంటువలస సచివాలయాలు, 13న వాడాడ, డొంకినవలస సచివాలయాలు, 15న కోటిపల్లి, గజరాయునివలస సచివాలయాలు, 18న గూడెపువలస, గొల్లాది సచివాలయాలు, 20న భీమవరం, బాడంగి-1 సచివాలయాలు, 22న ముగడ, బాడంగి-2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంగాంలో చేపడుతున్న జగనన్న సురక్ష సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మెంటాడ: మండల కేంద్రమైన మెంటాడలో బుధవారం జగనన్న సురక్ష సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ త్రివిక్రమ్ సర్వేను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్క వ్యక్తి ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ సర్వేను చేపడుతున్నట్లు చెప్పారు. వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించాలన్నారు.